క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

27న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 27న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

లలితా పీఠానికి పోటెత్తిన భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెంలో గల లలితాపీఠానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి వారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. జూలై 3వ తేదీ నుంచి సెప్టెంబరు 29 వరకు చాతుర్మాస్య దీక్షలు జరగనుండటంతో స్వామీజీ లలితాపీఠంలో భక్తులకు అందుబాటులో ఉంటున్నారు.

సత్యదేవుని హుండీ ఆదాయం రూ. 6.98 లక్షలు



హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

డాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్య నారాయణస్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం చేపట్టారు. ఈ లెక్కింపులో రూ.6 లక్షల 98 వేల 185 ఆదాయం వచ్చింది. హుండీ లెక్కింపులో ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్, జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయ ఈవో సురేష్‌బాబా, వేంకటేశ్వర సేవా సంఘం నుంచి డి. నగేష్, అప్పారావు ఆధ్వర్యంలో పలువురు సేవకులు, దేవస్థానం ప్రధాన అర్చకుడు పి. నరసింహాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీలలితా లహరి సప్తాహ ప్రవచనం



భక్తులను ఉద్దేశించి ప్రవచిస్తున్న మాతా రమ్యానందభారతి స్వామిని

సీతంపేట: అక్కయ్యపాలెం లలితాపీఠంలో జరుగుతున్న శ్రీలలితా లహరి సప్తాహ ప్రవచన కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శ్రీశక్తిపీఠాధీశ్వరి మాతాజీ రమ్యానందభారతి స్వామిని ప్రవచనం కొనసాగింది. ఈ సందర్భంగా జగన్మాత అయిన లలితాదేవి లీలా మహత్యం, ఉపాసన విధానాలు, మంత్ర రహస్యాలు, శ్రీయంత్ర విశేషాలతో కూడిన విషయాల గురించి ప్రవచించారు. శ్రీలలితా సహస్ర నామాల ఆవిర్భావం గురించి వివరిస్తూ ప్రతి రోజూ లలితా సహస్ర నామ పారాయణ చదివినా, విన్నా సకల శుభములు చేకూరుతాయని, పరిపూర్ణ జ్ఞానం చేకూరుతుందని తెలిపారు. లలితాపీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మహా స్వామి సమక్షంలో జరిగిన ప్రవచన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జగనన్న సురక్షతో.. సత్వర సేవలు

- లబ్ధిదారుల కళ్లలో నిజమైన ఆనందం
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



షాదీఖానాలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి



35వ వార్డులో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : సత్వర సేవలే జగనన్న సురక్ష లక్ష్యమని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 35, 39 వార్డుల్లో ఇందిరాగాంధీ మున్సిపల్ క్రికెట్ స్టేడియం, షాదీఖానా ప్రాంతాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు అందజేయాలనే ఉద్దేశంతో ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు 99 శాతం ప్రజలకు చేరువ అవుతున్నాయన్నారు. మిగిలిపోయిన ఒక్క శాతం ప్రజలను వలంటీర్లు, సెక్రటరీలు జల్లెడ పట్టి మరీ గుర్తించి అందిస్తున్నారన్నారు. ప్రజలకు ఎటువంటి ధ్రువపత్రాలు కావాలన్నా నమోదు చేసుకుని ఇంటికెళ్లి ఇస్తున్నారంటే అంతా జగనన్న ఘనత అన్నారు. ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లు సురక్ష ద్వారా పొందే అవకాశం వచ్చిందని వెంటనే ప్రజలు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని వాసుపల్లి తెలిపారు.

35 వార్డులో..

జీవీఎంసీ 35వ వార్డు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 850 మంది లబ్ధిదారులకు 11 రకాల ధ్రువపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆనంద్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వినయ్‌కుమార్, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు దొడ్డి రామానంద్, కర్రీ నీలకంఠం, దొడ్డి బాబునంద్, ఆదివిష్ణు, బొగ్గుశామ్, సుబ్రహ్మణ్యం, మంగరాజు, బోని దేవా, గౌరీశంకర్, కిశోర్, బొడ్డేటి ప్రసాద్, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

39వ వార్డులో..

జీవీఎంసీ 39వ వార్డు షాదీఖానాలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 808 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డీఈ వెంకటేష్, ఏపీడీ పుణ్యవతి, కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ముజీబ్‌ఖాన్, సనపల రవీంద్ర, సూరాడ తాతారావు, మసేన్, బాజ్జి, సలీం, కమాలుద్దీన్, తిత్తి కృష్ణ, రమణమ్మ, బుఖారీ, సెక్రటరీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు..



వలంటీర్లు ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించారు. వెంటనే నమోదు చేసుకుని వెళ్లి రెండు రోజుల్లో సురక్ష కార్యక్రమం ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. సంతోషంగా ఉంది.

– వనం కొండమ్మ, 35వ వార్డు.

ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమం



జగనన్న సురక్ష ప్రజలకు ఎంతో ఉపయోగపడే కార్యక్రమం. కార్యాలయాల చుట్టూ తిరిగినా జరగని పనులు ఇంటికి వచ్చి చేస్తున్నారు. ఇంత కంటే ఏం కావాలి. ఏ ప్రభుత్వం చేయని పని జగనన్న చేసి చూపిస్తున్నారు.

– ఆర్. వెంకటరావు, జీవీఎంసీ 35వ వార్డు.

రేషన్ కార్డు వచ్చింది..



ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీలో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు అన్నారు. ఇంటికి వచ్చి కావాల్సిన సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసుకుని అడిగిన ధ్రువపత్రాలు అందిస్తున్నారు. వలంటీర్ వచ్చి రేషన్‌కార్డుకు కావాల్సిన ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేసి సురక్ష కార్యక్రమంలో అందజేశారు.

– కృప, రేషన్‌కార్డు వచ్చింది, జీవీఎంసీ 39వ వార్డు.

సంక్షేమ పథకాలకు సురక్ష తోడైంది..



జగనన్న సంక్షేమ పథకాలకు సురక్ష తోడై ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తున్నారు. కార్యాలయాలకు వెళ్లే పని లేకుండా ఇంటి వద్దకు వచ్చి మరీ కావాల్సిన సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. అధికారులు సైతం ఇంటికి వస్తున్నారు. నేను ఆధార్‌లో తప్పులు సరి చేయించుకున్నాను.

– హనుమావతి, జీవీఎంసీ 39వ వార్డు.

కోలా గురువులుకు మాజీ మంత్రి బాలరాజు అభినందనలు



కోలా గురువులును అభినందిస్తున్న మాజీ మంత్రి బాలరాజు

మహారాణిపేట : వైఎస్సార్‌సీపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన కోలా గురువులును మంగళవారం పలువురు అభినందించారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో కోలా గురువులను మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. పార్టీకి గురువులు చేస్తున్న కృషిని గుర్తించి అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించిందన్నారు. క్రమశిక్షణతో పార్టీలో పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ నాయకులు కలిదిండి బద్రీనాథ్, అల్లంపల్లి రాజబాబు, రెయ్యి వెంకటరమణ, వంకాయల మారుతీ ప్రసాద్, పేర్ల విజయచందర్, రాజేశ్వరి, గేదెల నాగరాజు, బొండా ఉమామహేశ్వరరావు, సతీష్ వర్మ, నడింపల్లి కృష్ణంరాజు, చొక్కర శేఖర్, ప్రేమ్, సుబ్రహ్మణ్యం, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

పాతనగరం అభివృద్ధికి రూ.12.50 కోట్లు

జగదాంబ : పాతనగరం అభివృద్ధికి రూ.12.50 కోట్లు మంజూరు అయినట్టు జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో జగదాంబ నుంచి వన్‌టౌన్ పోలీసుస్టేషన్ వరకు విస్తరించాలని కౌన్సిల్‌లో చర్చ జరిగిందన్నారు. కౌన్సిల్ ఆమోదంతో రహదారితో పాటు కాలువల నిర్మాణాలకు మేయర్ హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆమోదం తెలిపారన్నారు. ఈ సందర్భంగా సహకరించిన కౌన్సిల్‌కు సాధిక్ కృతజ్ఞతలు తెలిపారు.

పార్శిల్ సెక్షన్ సందర్శన



కళాశీలతో మాట్లాడుతున్న ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు

అల్లిపురం : ద్వారకాబస్ స్టేషన్ ఆవరణలో గల పార్శిల్ సెక్షన్‌ను ఏపీఎస్ఆర్టీసీ జోన్–1, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పార్శిల్ సెక్షన్‌లో ఫిర్యాదులు, పార్శిల్ చేరే విధానం తనిఖీ చేశారు. అక్కడున్న సిబ్బంది కళాసీలను ఇంకా పెంచాలని అతనికి విన్నవించుకున్నారు. వినియోగదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీ బస్సు చార్జీల్లో విజయవాడకు 10 శాతం, అమరావతి, హైదరాబాద్‌కు 20 శాతం రాయితీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట ఏఈఎంసీ బాపిరాజు, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, కృష్ణ, కన్నా, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం వార్షికోత్సవం

జగదాంబ : ఉత్తరాంధ్ర బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం వార్షికోత్సవాలు జీవీఎంసీ 35వ వార్డు సైలాడ పైడితల్లి కల్యాణ మండపంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ కులవృత్తిదారులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేయూత పథకం ద్వారా ఆదుకుంటున్నారని అన్నారు. అదే విధంగా వాయిద్య కళాకారులకు సిటీ సెంటర్‌లో కమ్యూనిటీ భవనం నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎస్కే శ్రీరాములు, ఉపాధ్యక్షుడు కెల్లంపూడి విశ్వనాథం, త్రినాథరావు, శ్రీను, రాజు, సాయిబాబా, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

జగదాంబ : సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించారు. సమస్యలకు సంబంధించి ఆయా అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, జేసీఎస్ ఇన్‌చార్జి, 29వ వార్డు ప్రెసిడెంట్, స్టేట్ ఫారెస్ట్ డైరెక్టర్ పీతల వాసు, 38వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సంకాభక్తుల సన్యాసిరావు, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బోనిదేవా, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మణిపూర్‌లో చిచ్చుకు బీజేపీయే కారణం'



సంఘీభావం తెలుపుతున్న వివిధ రాజకీయ పార్టీల నేతలు

సీతంపేట: మణిపూర్‌లో రెండు నెలలకు పైగా జరుగుతున్న హింసాకాండను అక్కడి బీజేపీ ప్రభుత్వమే నడిపిస్తుందని పలు రాజకీయ పార్టీల నేతలు ఆరోపించారు. సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో మణిపూర్ ఘటనపై జరిగిన చర్చా గోష్ఠిలో టీడీపీ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, లోక్‌సత్తా, మహిళా సమాఖ్య నాయకులు పాల్గొన్నారు. సీపీఐ విశాఖజిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్నది మత హింస, కేవలం రెండు మతాల మధ్య జరుగుతున్న పోరాటం కాదని, భూమి, వనరుల వంటి ప్రధాన అంశాలు ఇమిడి ఉన్నాయన్నారు. ఇందులో మత మౌఢ్యులు, మిలిటెంట్లు పాల్గొంటున్నాయని ఆరోపించారు. అధికారంలో ఉన్న బీజేపీ ఫాసిస్టు ప్రభుత్వం తవ రహస్య కార్పొరేట్ అజెండా నెరవేరేలా తెలివిగా వ్యూహాలు రచించి అమలు చెయ్యడమే నేటి సంక్షోభానికి దారి తీసిందని ఆవేదన వ్యక్తం చేసారు. ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ రాజీనామా చెయ్యాలని, సుప్రీంకోర్టు అజమాయిషీలో విచారణ జరిపించి బాధితులకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్, సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి వై. కొండయ్య, ఎంసీపీఐయూ జిల్లా నాయకుడు కె.శంకరరావు, ప్రజాపోరు నాయకుడు కె.దేవా, భారత్ బచావో నాయకుడు శ్రీనివాస్, ఆప్ పార్టీ జిల్లా కన్వీనర్ ఇ.చంద్రశేఖర్ లోక్‌సత్తా నాయకుడు ఎంఎస్ఎన్ మూర్తి, మహిళా సమాఖ్య నాయకులు ఎ. విమల తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

సకల కళాకారుల సంఘం ఎన్నికలకు నామినేషన్లు



నామినేషన్ అందజేస్తున్న రచయిత్రి జాలాది విజయ

సీతంపేట: విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘానికి ఈ నెల 30వ తేదీన జరగనున్న ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం మంగళవారం స్థానిక పౌర గ్రంథాలయంలో జరిగింది. అధ్యక్ష స్థానానికి రచయిత్రులు డాక్టర్ జాలాది విజయ, చెక్కా రమాదేవి, ఉపాధ్య స్థానానికి ఎం. త్రినాథరావు, పీఏ భాస్కరరావు, కార్యదర్శి స్థానానికి కె.లోకేష్, సహాయ కార్యదర్శి స్థానానికి గెంబలి జగదీష్, కోశాధికారి స్థానానికి మదుపాడ రమణి, బూడిద లక్ష్మి స్వరూప నామినేషన్లు వేశారు. ఎన్నికల అధికారులుగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, గాయకులు జామి శివ అప్పలరాజు వ్యవహరించారు. ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ చెన్నా తిరుమలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బీజేపీని గద్దె దింపి దేశాన్ని కాపాడాలి



రామకృష్ణ జంక్షన్‌లో ధర్నా నిర్వహిస్తున్న రిక్షా కార్మికులు

అల్లిపురం : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి దేశాన్ని కాపాడాలని రిక్షా కార్మికుల సంక్షేమ బోర్డు జిల్లా కార్యదర్శి జి.వామనమూర్తి, జిల్లా అధ్యక్షుడు చెల్లూరి బుజ్జి అన్నారు. ఈ మేరకు ఆగస్టు 9వ తేదీన విజయవాడలో జరగనున్న మహా ధర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం రామకృష్ణ జంక్షన్‌లో రిక్షా కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాయకష్టం చేసే రిక్షా కార్మికులు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు సాధనకు పోరాడాలని కోరారు. మణిపూర్‌లో మారణ హోమం ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రావి కృష్ణ, కె.రాజు, వి.పైడిరాజు, ఎన్.నూకరాజు, సన్నీబాబు, చిన్నారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మ ఉత్సవం



అనుపు కార్యక్రమంలో పులివేషాల సందడి



మన్యాలను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 29వ వార్డు డిబ్బలపాలెంలో వెలసిన బంగారమ్మ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 21న చాటింపు కార్యక్రమంతో ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారం అనుపు మహోత్సవంతో ముగిసాయి. గ్రామంలో చదునుపట్టు వద్ద వెలసిన గ్రామ దేవత బంగారమ్మను పీ అండ్ టీ క్వార్టర్స్, చందకవీధి, డిబ్బలపాలెం, ప్రకాశరావుపేట, యల్లమ్మతోట, దండు బజార్, రామజోగిపేట, పితానిదిబ్బ, గొల్లలపాలెం, యల్లమ్మతోట తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, తెలుగుదేశం పార్టీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఉరికిటి నారాయణరావు, వార్డు అధ్యక్షుడు పీతల వాసు, పలువురు ప్రముఖులు హాజరై అమ్మవారికి పూజలు జరిపారు. బంగారమ్మకు పంచామృతాభిషేకాలు, పసుపు, కుంకుమార్చనలు జరిపారు. ఉదయం నుంచి గ్రామ పురవీధుల్లో పూలఘటాలు, కూటి ఘటాలు తిరిగాయి. సాయంత్రం 4 గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పులివేషాలు, అష్టలక్ష్ములు, సాముగరిడీ వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి చదునుపట్టు నుంచి పీ అండ్ టీ క్వార్టర్స్, చందకవీధి, డిబ్బలపాలెం, జగదాంబ జంక్షన్, ప్రకాశరావుపేట, జడ్జి కోర్టు మీదుగా పితానివీధిలో గల బంగారమ్మ ఆలయం వరకు మేళ తాళాలు, డప్పు వాయిద్యాలు, తీన్మార్ బ్యాండ్‌లతో అమ్మవారి ప్రభను ఊరేగించారు. మారువారాన్ని పురస్కరించుకుని ఆగస్టు ఒకటి మధ్యాహ్నం 12 గంటల నుంచి పెద్ద ఎత్తున అన్న సమారాధన, సాయంత్రం 6 గంటలకు ఊరేగింపు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ చందక అప్పలరాజు తెలిపారు.

మన్యాలకు సత్కారం

డాబాగార్డెన్స్ : బంగారమ్మ ఉత్సవాల్లో సహాయ సహకారాలు అందించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్‌ను ఉత్సవ కమిటీ చైర్మన్ చందక అప్పలరాజు, కోశాధికారి యలమంచిలి సదాశివరావు, కమిటీ సభ్యుడు చందక ప్రభాకర్ అమ్మవారి జ్ఞాపిక అందజేసి సత్కరించారు.

కూలిన చెట్టు.. పట్టించుకోని అధికారులు



సీతమ్మధార నుంచి అల్లూరి విగ్రహానికి వెళ్లే దారిలో కూలిన చెట్టు

సీతమ్మధార: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మంగళవారం ఉదయం సీతమ్మధార ప్రధాన రహదారిలోని ఆర్ అండ్ బి రోడ్డులో రెండు చెట్లు కూలిపోయాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా వాహనాల రాకపోకలకు వీలు లేకుండా పోయింది. జీవీఎంసీ 24వ వార్డులోని ప్రధాన రహదారిలో ఈ ఘటన చోటు చేసుకుంది. రోడ్డు మధ్యలో చెట్టు కూలిపోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. జీవీఎంసీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని చుట్టుపక్కల వారు, వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చెట్టును తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమి పూజ



దేవాలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సీతంరాజు సుధాకర్

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్ వద్ద వెంచేసిన పోలమాంబ, కొత్తమాంబ, భూలోకమాంబ అమ్మవార్ల గుడి నిర్మాణానికి మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ భూమిపూజ చేశారు. ఆయన సొంత నిధులతో ఆలయ నిర్మాణం చేపట్టారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు సుధాకర్‌కు స్వాగతం పలికారు. మత్స్యకారుల ఇలవేల్పు గంగమ్మ తల్లి గుడి పక్కన వేంచేసిన ముగ్గురు అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి సుధాకర్ తన వంతు ఆర్థిక సహాయం అందించారు. మత్స్యకారుల అభివృద్ధికి, సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని సీతంరాజు సుధాకర్ తెలిపారు. ఆలయ నిర్మాణంలో తనను భాగస్వామ్యం చేయడం పట్ల ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, ఏపీ మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతపల్లి పోతురాజు, ఆలయ కమిటీ పెద్దలు నొల్లి మురళి, పూజారి చింతపల్లి రాంబాబు, గౌరవ అధ్యక్షుడు పెంటయ్య మాస్టర్, అధ్యక్షుడు జయకుమార్, కార్యదర్శి అయ్యప్పరాజు, కమిటీ సభ్యులు గణేష్, పోతు స్వామి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అద్భుత ఫలితాలు సాధించాలి



పోస్టర్ విడుదల చేస్తున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

మహారాణిపేట : స్వచ్ఛ సర్వేక్షణ్ –2023లో అద్భుత ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గోడ పత్రికను విడుదల చేశారు. పట్టణాలు, నగరాలు, గ్రామాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ నిర్వహిస్తూ, పరిశుభ్రమైన నగరాలను రూపొందించడంలో ఇది కీలకమైందన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే జరుగుతుందని, 79 పంచాయతీలను లక్ష్యంగా నిర్ణయించినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం మానుకోవాలని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ పిలుపునిచ్చారు. దానివల్ల అనేక వ్యాధులు, అంటు రోగాలు వస్తాయన్నారు. మన గ్రామాన్ని, జిల్లాను బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చుకుందామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.శ్రీరామమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి ఎంపీఏ శ్రీనివాసరావు, పీఆర్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కేవీ శివానందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ టమాటాకు తగ్గని డిమాండ్

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో కిలో రూ.50 చొప్పున రెండు టన్నుల టమాటాలు సబ్సిడీపై విక్రయించారు. టమాటా ధర నియంత్రణకు ప్రభుత్వం సబ్సిడీపై రైతుబజార్లలో వీటిని విక్రయిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.120 నుంచి 130 వరకు విక్రయిస్తున్నారు. ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా టమాటాలు కొనుగోలు చేసి సబ్సిడీపై ప్రజలకు అందిస్తోంది. మంగళవారం కూడా నగరంలోని అన్ని రైతుబజార్లలో సబ్సిడీ టమాటాలు విక్రయించారు. నరసింహనగర్ రైతుబజార్‌కు 80 క్రేట్లు (రెండువేల కిలోలు) టమాటా వచ్చినట్టు ఎస్టేట్ ఆఫీసర్ చినబాబు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేసి టమాటాలు విక్రయించారు. సబ్సిడీ టమాటాల కోసం వినియోగదారులు తెల్లవారుజాము నుంచే క్యూలు కట్టారు. క్యూలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఆధార్ లేదా రేషన్ కార్డుపై కిలో చొప్పున విక్రయించారు. ఉదయం 8.30 గంటలకే రెండు వేల కిలోల టమాటా విక్రయించారు.

సీతమ్మధార రైతుబజారులో..

సీతమ్మధార: సబ్సిడీ టమాటా కోసం సీతమ్మధార రైతుబజారులో వినియోగదారులు బారులు తీరారు. కిలో రూ.50కు విక్రయించారు. వినియోగదారులు టమాటా కోసం క్యూ కట్టారు. ఆధార్, రేషన్ కార్డుకు కిలో టమాటా రూ.50కి విక్రయించారు. మొత్తం మంగళవారం 109 క్రేట్ల టమాటా విక్రయించినట్లు రైతు బజార్ అధికారి కొండబాబు తెలిపారు.